# మరిపెడ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక పూర్తి


● ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ డా. జాటోత్ రామచంద్ర నాయక్ నూతన సభ్యులకు శుభాకాంక్షలు



**మరిపెడ, జూలై 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** మరిపెడ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక కార్యక్రమం మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ పాల్గొని ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. కో-ఆప్షన్ సభ్యులుగా దేవరశెట్టి శ్రీలత లక్ష్మీనారాయణ, గుండగాని వెంకన్న, షేక్ అజీజ్ పాషా, షేక్ సలీమ తాజోద్దీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డా. జాటోత్ రామచంద్ర నాయక్ నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా పనిచేసి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని నూతన కో-ఆప్షన్ సభ్యులను అభినందించారు.

# నల్ల గంతలతో కాంగ్రెస్ వినూత్న నిరసన.. నీట్ లీకేజీపై కేంద్రాన్ని నిలదీసిన ప్రభుత్వ విప్ డా. రామచంద్ర నాయక్

## విద్యార్థులపై లాఠీచార్జ్, కాంగ్రెస్ నేతల అరెస్టులను ఖండింపు ధర్మేంద్ర ప్రధాన్ తొలగింపు, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్



**మరిపెడ, జూలై 22( పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్, కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులకు నిరసనగా మరిపెడలో కాంగ్రెస్ నాయకులు వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రామచంద్ర నాయక్ కళ్లకు నల్ల గంతలు కట్టుకుని పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రశ్నించే విద్యార్థుల గొంతుకలను బలప్రయోగంతో అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దేశ భవిష్యత్తైన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై లాఠీచార్జ్ చేయించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఘోర వైఫల్యమని పేర్కొంటూ, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని కోరారు. నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు "మోడీ డౌన్ డౌన్", "విద్యార్థులకు న్యాయం చేయాలి", "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి" అంటూ నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అణచివేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొత్తికొయగూడెంలో వైద్య శిబిరం.





**ఏటూరునాగారం,జూలై 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొండాయి వైద్య అధికారిడా. హెచ్.ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో కొండాయిలో గొత్తికొయగూడెం వైద్య శిబిరం మరియు హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే చేయడం జరిగింది. ఇందులో భాగంగా హెల్త్ క్యాంపు మరియు ఇంటి ఇంటికి తిరిగి ఫీవర్ సర్వే చేయడం జరిగింది. 52 మందికి మందులు ఇవ్వడం జరిగింది, ఇశీదులో భాగంగా ముగ్గురికి మలేరియా పరీక్షలు చేయగా ఈ పరీక్షలో నెగెటివ్ రిపోర్ట్ వచ్చింది, అలాగే గర్భిణీలను పరీక్షించి వారికి కూడా తగిన మందులు పంపిణీ చేయడం జరిగింది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోమని అలాగే వేడి చేసిన నీరు కాచి త్రాగమని సుచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమశీలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు,ఎఎన్ఎమ్ సమ్మక్క,ఆశలు లక్ష్మి పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్, రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ అరెస్టులను ఖండిస్తూ ములుగులో కాంగ్రెస్ శాంతియుత నిరసన




**ఏటూరునాగారం,జూలై 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని, అలాగే విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తదితర కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ పాల్గొని మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. అలాంటి విద్యార్థులపై బలప్రయోగం చేయడం, వారిని అణిచివేసే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల గొంతును అణచివేయడం, ప్రశ్నించే వారిపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. దేశ యువత, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని, నిరసనలను అణచివేయడం ద్వారా ప్రజల స్వరాన్ని ఎప్పటికీ మూయలేరని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగా కళ్యాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఏటూరునాగారం ఆటో యూనియన్‌కు నూతన అధ్యక్షుడిగా ఇర్సవడ్ల కిరణ్



## ● ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ● డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యమని నూతన కమిటీ ప్రతిజ్ఞ



**ఏటూరునాగారం,జూలై 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఆటో యూనియన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఆటో డ్రైవర్లు, యజమానుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో జరిగిన ఈ ఎన్నికల్లో ఇర్సవడ్ల కిరణ్ నూతన అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా పెండ్యాల ప్రభాకర్, గంపల శివకుమార్, చారి వ్యవహరించారు. మొత్తం 70 మంది సభ్యులకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసి, ఎన్నికల నిబంధనల ప్రకారం పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు. మొత్తం 67 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి తాళ్లపల్లి కుమార్ మరియు ఇర్సవడ్ల కిరణ్ మధ్య హోరాహోరీ పోటీ జరగగా, కిరణ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఇతర పదవుల్లో గాడిచర్ల మహేష్ కార్యదర్శిగా, యాకూబ్ పాషా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారి పదవికి జరిగిన పోటీలో ముదురుకోళ్ల సతీష్ విజయం సాధించారు. ఎన్నికల అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రయాణికులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల బస్టాండ్ ప్రాంతంలో తప్పిపోయిన బాలుడిని మూడు గంటల పాటు కాపాడి, వాట్సాప్ గ్రూపులు మరియు గ్రామ పెద్దల సహాయంతో అతని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించిన ఆటో డ్రైవర్ ముదురుకోళ్ల శ్రీకాంత్ సేవాభావాన్ని నూతన కమిటీ ప్రత్యేకంగా అభినందించింది. శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించి, ప్రతి ఆటో డ్రైవర్ సమాజ సేవకు ఆదర్శంగా నిలవాలని సూచించింది. అలాగే మాజీ అధ్యక్షుడు తాళ్లపల్లి కుమార్ సేవలను గుర్తిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి గాడిచర్ల మహేష్, కోశాధికారి ముదురుకోళ్ల సతీష్, ఉపాధ్యక్షుడు యాకూబ్ పాషాలను సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని ఆటో డ్రైవర్లు విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఇర్సవడ్ల కిరణ్ మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఆటో డ్రైవర్‌కు రుణపడి ఉంటాను. ఆటో డ్రైవర్ల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాను. ప్రతి డ్రైవర్‌కు లేబర్ కార్డు, బీమా సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. యూనియన్‌ను మరింత బలోపేతం చేసి డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, యజమానులు, ఎన్నికల అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికలు క్రమశిక్షణతో, ఐకమత్య వాతావరణంలో నిర్వహించబడటం విశేషంగా నిలిచింది.

# భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా (బీజేవైఎం) కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా సంగ నరేష్..



**కరీంనగర్ జిల్లా జూలై 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ యువ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా చొప్పదండి పట్టణానికి చెందిన సంఘ నరేష్ ను నియమిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేవైఎం నూతన అధ్యక్షులుగా నియమితులైన నరేష్ మాట్లాడుతూ జిల్లాలో బీజేవైఎం బలోపేతానికి, యువతలో దేశభక్తి , జాతీయతా భావం పెంపొందించడానికి సామాజిక సేవ లో యువతను భాగస్వామ్యం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్, బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణా రెడ్డి ,కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ,డిప్యుటి మేయర్ సునిల్ రావు ,కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ ప్రవీణ్ రావు , బిజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ లకు రాష్ట్ర,జిల్లా పార్టీ పెద్దలకు, నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

